
# గొప్పతనం



'ఆంధ్రభూమి' వారపత్రిక . . . 6 మే, 2004

భార్య చెప్పింది విని అదిరిపడ్డాడు శ్రీపాదరావు.

"నువ్వు చెప్పింది నిజమా?" మళ్లీ అనుమానంగా అడిగాడు.

"నిజమే! మొదట నేనూ నమ్మలేదు. సందీప్ జరిగింది పూర్తిగా చెప్పాక నమ్మక తప్పలేదు" అంది జయ.

"అందుకేనా జయంతి పనిలోకి రావడం లేదు?"

'అవు'నన్నట్టు తలూపింది జయ.

శ్రీపాదరావు ముఖం ఆందోళనతో నిండిపోయింది.

"నీ సుపుత్రుణ్ణి పిలు..!" కోపంగా అన్నాడు భార్యతో.

"వద్దండీ... ఇప్పుడు వాడినేమీ అనకండి! జరిగినదానికి వాడెంతో బాధపడుతున్నాడు."

"ఈ పాపంలో వాడి భాగం కూడా ఉందా?"

"లేదు. వాడు అమాయకుడు. అయినా వాడి గురించి మీకు మాత్రం తెలియదా?" అంది జయ.

శ్రీపాదరావు అసహనంగా అక్కడ్నుంచి కదిలి హాల్లోకి వెళ్లి ఈజీఛైర్‌లో కూర్చున్నాడు.

అతని కళ్ళముందు జయంతి రూపమే కదలసాగింది...

అందంగా, అమాయకంగా ఉండే ఆ కళ్ళు తనని తీక్షణంగా చూస్తూ, ప్రశ్నిస్తున్నట్టు కనిపించసాగింది అతనికి.

అతనికి జయంతి మొదటిసారిగా అతనింటికి వచ్చినరోజు గుర్తొచ్చింది...

ఆరోజు శ్రీపాదరావు హాల్లో పేపరు చదువుకుంటుంటే ఇంట్లోకి ఓ అమ్మాయి వెళ్లడం చూశాడు. పాతికేళ్లుంటాయి... అందంగా, ఆరోగ్యంగా ఉంది. చామనఛాయలో ఉన్నా ముఖం ఎంతో కళగా ఉంది. ఇరుగుపొరుగు ఇళ్లలోని అమ్మాయి కాబోలనుకున్నాడు మొదట.

ఆ అమ్మాయి ఎంతసేపటికీ బయటకి రాకపోవడంతో లేచి లోపలికి వెళ్లి చూశాడు.

ఆ అమ్మాయి పెరట్లో బట్టలు ఉతుకుతోంది. అప్పుడర్థమయింది అతనికి- ఆ అమ్మాయి తన ఇంట్లో పనిమనిషిగా చేరిందని! తర్వాత జయ చెప్పింది- ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకొన్న భర్త వదిలేశాడనీ, ప్రస్తుతానికి తల్లితోనే ఉంటోందనీ, ఆ తల్లే నాలుగిళ్లలో ఆ అమ్మాయికి పని కుదిర్చిందనీ!

అంత అందమైన ఆడది ఇకపై ప్రతిరోజూ తన ఇంట్లో, తన కళ్ళ ఎదురుగా తిరుగుతూ కనిపిస్తుందన్న విషయం శ్రీపాదరావుకి ఎంతో ఆనందాన్నిచ్చింది.

రోజూ భార్యకి తెలియకుండా జయంతి వైపు దొంగచూపులు చూసేవాడు.

పాత్రలు తోముతున్నప్పుడు ఏదో ఒక పని కల్పించుకొని పెరట్లోకి వెళ్లేవాడు. ఆమె పనిలో మునిగి ఉన్నప్పుడు కనిపించే అందాలను చూసి ఆనందించేవాడు. అయితే వెకిలిగా మాత్రం ప్రవర్తించేవాడు కాదు. మనసులో చిలిపి కోరికలున్నా- అనేకసార్లు జయంతితో ఏకాంతం దొరికినా, హద్దు దాటి ప్రవర్తించేవాడు కాదు.

ఒకరోజు స్నానానికి వెళ్లబోతూ వంటింట్లో జయంతి తన భార్యతో అంటున్న మాటలు విన్నాడు.

"వయసులో ఉన్న ఒంటరి ఆడదాన్ని చూస్తే మగవాళ్ళు చొంగలు కారుస్తూ, దొంగచూపులు చూస్తూంటారు. అసభ్యంగా, ద్వంద్వార్థాలతో మాట్లాడటం, భార్యకు తెలియకుండా చేయి పట్టుకోవడం చేస్తూంటారు. అన్నిటినీ భరిస్తూ, తెలివిగా తప్పించుకుంటూ రోజులు గడుపుతున్నాను. అయితే మీ సారు మాత్రం బంగారం! నన్ను ఏనాడూ మరో దృష్టితో చూడలేదు. మీరు ఉన్నప్పుడు ఎలా ప్రవర్తిస్తారో- లేనప్పుడూ అలాగే ప్రవర్తిస్తారు. మీ ఇంట్లోనే నేను ధైర్యంగా, నిశ్చింతగా పని చేసుకోగలుగుతున్నాను."

ఆ మాటలు విన్న శ్రీపాదరావు ఎంతో సిగ్గుపడ్డాడు.

ఆరోజు నుంచి జయంతిని ఓ కూతురిలా చూసుకున్నాడు. ఆమె ఇంటర్ సగంలో చదువు నిలిపేసిందని తెలుసుకొని ఆమెకు పుస్తకాలు చదవడం అలవాటు చేశాడు. తాను సేకరించిన మంచి పుస్తకాలను ఆమెకు ఇచ్చి చదవమని చెప్పేవాడు. చదివాక ఇద్దరూ ఆ కథల గురించి చర్చించేవారు. జయంతి భాషను కూడా మార్చాడు. ఆమెకు అవసరమొచ్చినప్పుడు ఆర్థికంగా కూడా సహాయం చేసేవాడు.

గతవారం జయ అన్న కూతురు పెళ్ళికి శ్రీపాదరావు దంపతులు హైదరాబాద్ వెళ్లారు. డిగ్రీ చదువుతున్న వారి ఏకైక కుమారుడు సందీప్- తాను రానని, పరీక్షలకు చదువుకోవాలని చెప్పడంతో అతన్ని వదిలేసి వెళ్లారు.

అయితే... ఊరి నుంచి రాగానే సందీప్ చెప్పిన విషయం విని షాకయింది జయ.

సందీప్‌కి తోడుగా రాత్రి పడుకోవడానికి వచ్చిన అతని ఫ్రెండ్స్- రాత్రి వాడిన పాత్రలు కడిగిపెట్టడానికి ఉదయాన్నే వచ్చిన జయంతిపై అఘాయిత్యం చేశారు.

జయ భయపడుతూనే భర్తకి విషయం చెప్పింది. ఆమెకి తెలుసు- అతను ఇలాంటివి తట్టుకోలేడనీ, ఎక్కువ ఆందోళన పడతాడనీ! అయితే... విషయం దాచిపెడితే సమస్య అలాగే ఉండిపోతుంది. జరిగింది చెప్పేస్తే అతనే దీనికి పరిష్కారం ఆలోచిస్తాడు. భర్తపై ఆ నమ్మకం ఉంది ఆమెకి.

ఆరోజు సాయంత్రం శ్రీపాదరావు కొడుకుని పిలిచి వివరాలు అడిగాడు.

భయపడుతూనే జరిగింది చెప్పాడు సందీప్.

"ఇందులో నీ పాత్ర లేదంటావ్?"

"లేదు. అమ్మమీద ప్రమాణం చేయమన్నా చేస్తాను."

"మరి, వాళ్ళు ఆ పాపం చేస్తూంటే నీవేం చేస్తున్నావు..?"

"నేను ఉదయం అయిదు గంటలకు జాగింగ్‌కి వెళ్లిపోయాను. ఆరుగంటలకు జయంతి వచ్చింది."

"ఇంట్లో మేము లేని రోజు, నీ స్నేహితులు ఉన్నరోజు- ఇంటిని చూసుకోవాలని నీకు తెలియదా? ఒక్కరోజు జాగింగ్‌కి పోకపోతే కొంపలంటుకుపోతాయా..?" కోపంగా కొడుకుని చూస్తూ అన్నాడు.

మౌనంగా తలదించుకున్నాడు సందీప్.

ఆరోజు సాయంత్రం జయంతి తల్లిని ఇంటికి పిలిపించాడు శ్రీపాదరావు. ఆమె వచ్చి ఏం అల్లరి చేస్తుందో, ఎన్ని మాటలంటుందో అన్న భయం అతనికి ఉంది. అందుకే ఆమె ఏం

అడుగుతుందో, తను ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో ముందే రిహార్సల్ చేసుకొని మరీ సిద్ధమయ్యాడు.

ఆమె రాగానే "ఏమిటీ... జయంతి పనిలోకి రావడం లేదు?" అని అడిగాడు ఆమెకి విషయం తెలుసో, తెలియదో తెలుసుకుందామని..

"మీరు ఊర్లో లేనప్పుడు మీ ఇంట్లో జరిగిన విషయం మీకు తెలియదా?" ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

"తెలిసింది. జరిగిందానికి నేనెంతో బాధపడుతున్నాను. ఈ విషయం ఊర్లో ఎంతమందికి తెలుసు?"

"మేమెవరికీ చెప్పలేదు. చెప్పుకొంటే పోయేది మా పరువే కదా!"

"సరిగ్గా చెప్పావు. ఇది మన ఇద్దరి పరువుకీ సంబంధించిన విషయం కాబట్టి ఈ విషయాన్ని మనలోనే దాచుకొందాం!" అంటూ అల్మైరా దగ్గరికి వెళ్లి ఓ నోట్లకట్ట తీసుకొని ఆమెకిస్తూ...

"పదివేలు! ఉంచుకో... అవసరానికి ఉంటుంది. జయంతి ఇక మా ఇంటికి రాదని నాకు తెలుసు. ఎందుకు మా ఇంట్లో పని మానేశావని ఎవరైనా అడిగితే జీతం పెంచలేదని చెప్పమను. జరిగిన విషయం బయటికి రాకూడదు. మా ఇంట్లో జరిగిందన్న విషయం పదిమందికి తెలిస్తే నేను తలెత్తుకు తిరగలేను."

జయంతి తల్లి డబ్బులు తీసుకొని వెళ్లిపోయింది.

ఆమె మాటల్లో ఎక్కడా పోలీసు కంప్లయింటు ఇస్తున్నట్టుగాని, మహిళా సంఘాలతో మాట్లాడినట్టుగాని చెప్పకపోవడంతో అతనిలో ఆందోళన చాలావరకు తగ్గింది. పైగా- డబ్బులు చూడగానే ఆమె కళ్ళలో మెరుపు అతను గమనించాడు.

'ధనమూలం ఇదం జగత్' అనుకొని నవ్వుకున్నాడు.

●

**నా**లుగు రోజుల తర్వాత జయంతి తన ఇంట్లోకి రావడం చూసి, ఆశ్చర్యపోయాడు శ్రీపాదరావు.

"రామ్మా... బాగున్నావా?" అని అడిగాడు.

బాగున్నానన్నట్టు తలూపి వంటగదిలోకి వెళ్లింది.

ఆ తర్వాత ఆమె పనిలో దిగిపోవడం గమనించాడు శ్రీపాదరావు.

ఆమె పెరట్లో ఉన్నప్పుడు భార్య దగ్గరికి వెళ్లి అడిగాడు-

"ఏమంటుంది జయంతి..?"

"ఏమీ తోచడం లేదనీ, పనిలోకి వస్తాననీ అడిగింది. నేను కాదనలేక 'సరే'నన్నాను. అన్ని పనులు చేసుకోవడం నావల్ల కూడా కావడం లేదు. జరిగినదానిలో మన తప్పూ లేదు, ఆమె తప్పూ లేదు. అటువంటప్పుడు మన ఇంట్లో తిరిగి పనిలో చేరితే తప్పేముంది..?"

"అలాగే చెయ్యమను. నాకేం అభ్యంతరం లేదు..." అన్నాడు శ్రీపాదరావు.

జయంతి పనయ్యాక ఇంటికి వెళుతూ శ్రీపాదరావు దగ్గరికి వచ్చి, "ఇంట్లో ఏమీ తోచడం లేదు అంకుల్! పైగా... నేను ఎంత బాధపడుతున్నానో అని ఆంటీ ఇక్కడ బాధపడుతూ ఉంటారు.

అందుకే నేను మామూలుగానే ఉన్నానని ఆమెకి తెలియజేయడం కోసం నేను మళ్లీ పనిలో చేరాను. మీరందరూ నాతో ఇదివరకు ఎలా ఉండేవారో అలాగే ఉండండి...” అంది.

ఆమె తన భార్య మాత్రమే బాధపడుతున్నదని చెప్పడం అతనికి నచ్చలేదు.

“అంటే... జరిగినదానికి నేను బాధపడటం లేదంటావా?” నిష్ఠూరంగా అన్నాడు.

“జరిగినదానికి బాధపడి వుంటారు. నా గురించి బాధపడి ఉండరు...”

“అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?”

“బాధపడి వుంటే మా ఇంటికి వచ్చి నన్ను ఓదార్చి ఉండేవారు.”

తప్పు చేసినవాడిలా చూశాడు శ్రీపాదరావు ఆమె వైపు.

“నన్ను ఎంతో అభిమానంగా, ఓ కూతుర్లా చూసుకున్న మీరు- మీ అబ్బాయి స్నేహితులు నాపై అత్యాచారం చేశారన్న విషయం తెలియగానే మీ పరువు గురించే ఎక్కువగా ఆలోచించారు. ‘ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలా? మానుంచి ఎలాంటి గొడవలు రాకుండా ఎలా మేనేజ్ చేయాలా?...’ అని మీరు ఆలోచించారు గానీ, నా మనసు ఎంత గాయపడి ఉంటుందా... అని మీరు ఆలోచించలేదు, నన్ను ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. కనీసం మా అమ్మతో మాటవరసకి కూడా నేనెలా ఉన్నానని మీరు అడగలేదు...”

సిగ్గుతో తలదించుకున్నాడు శ్రీపాదరావు.

“మిమ్మల్ని బాధపెడితే నన్ను క్షమించండి. ఇన్నిరోజులూ నా మనసులో ఉన్న బాధ మీకు చెప్పకుండా ఉండలేకపోయాను. అంకుల్... మీకు ఓ కొసమెరుపు లాంటి నిజం చెప్పనా..?”

చెప్పమన్నట్టు కుతూహలంగా చూశాడు ఆమె వైపు.

“వాళ్ళు నాపై అత్యాచారం చెయ్యలేదు. చెయ్యబోయారు... అంతే!”

“నిజమా..?” ఆశ్చర్యంగా అన్నాడు.

“అవును. ఆవేశం తప్ప మరొకటి తెలియదు వాళ్ళకు. నా బట్టలు చించడం తప్ప మరేం చెయ్యలేదు వాళ్ళు!”

శ్రీపాదరావుకి ఆ విషయం ఎంతో రిలీఫ్‌నిచ్చింది.

“మరి, మా అబ్బాయి అలా చెప్పాడు..?” అనుమానంగా అడిగాడు.

“మీ అబ్బాయి అమాయకుడు. చూసింది కొంత, ఊహించింది కొండంత! పైగా... ఆ స్నేహితులు తాము హీరోలమని చెప్పుకోవడానికి అబద్ధం చెప్పివుండొచ్చు. అలాంటివాళ్ళు పదిమంది మీదపడ్డా వాళ్ళకు బుద్ధి చెప్పగల ధైర్యం, బలం నాకుంది.”

ఆ క్షణం శ్రీపాదరావు కళ్ళకి ఝాన్సీలక్ష్మిలా కనిపించింది జయంతి.

“ఏమీ జరగనప్పుడు మా ఇంటికి ఇన్నిరోజులూ ఎందుకు రాలేదు?” అని అడిగాడు ఆమెని.

“దానికి కారణం మీ ప్రవర్తన! ఆ కుర్రాళ్ళ ప్రవర్తన గురించి ఎక్కువ బాధపడలేదు నేను. కాని, మిమ్మల్ని ఎంతో గొప్పగా ఊహించుకున్న నేను- మీరు మామూలు మనిషికన్నా తక్కువగా ఆలోచించడం, ప్రవర్తించడం చూసి ఎంతో కలతపడ్డాను. షాకయ్యాను కూడా! ఆ షాకు నుంచి తేరుకోవడానికే ఇన్నిరోజులు పట్టింది.”

బాధగా కళ్ళు మూసుకున్నాడు శ్రీపాదరావు.

తను ఇంత పెద్ద తప్పు చేశానని ఆమె చెప్పేవరకు తనకు తెలియనందుకు తనపై తనకే కోపం వచ్చింది.

ఆమె తనతో పాటు తెచ్చుకున్న సంచి నుంచి ఓ ప్లాస్టిక్ కవర్ తీసి అతనికి ఇస్తూ...

"ఇందులో మీరు మాఅమ్మకు ఇచ్చిన పదివేలు ఉన్నాయి. మా అమ్మకు డబ్బు పైన ప్రేమ ఎక్కువ. అందుకే ఆమె మీకు విషయం పూర్తిగా చెప్పలేదు. నన్నూ చెప్పవద్దని ఒట్టేయించుకుంది" అంది నవ్వుతూ.

"ఫర్వాలేదమ్మా... మీ అమ్మకు ఇచ్చేయ్ ఈ డబ్బులు!"

"వద్దు అంకుల్! డబ్బుతో అన్ని సమస్యలూ తీరవు. ఎంత ఇచ్చినా తృప్తి ఉండదు... మీకు వీలైతే ఆ కుర్రాళ్ళను పిలిపించి, మందలించి, ఆ తప్పు మళ్లీ చేయకుండా పరివర్తన తీసుకురండి. ఎందుకంటే అందరు ఆడపిల్లలూ నాలా సబలలు కాదు!" అంటూ వెళ్లిపోయింది.

వెళ్తున్న జయంతి వైపే చూస్తూండిపోయాడు శ్రీపాదరావు.

కొంతమంది మనుషులు సాధారణంగా కనబడినా, ఎంత గొప్పగా ఆలోచిస్తారో, ఎంత ఉన్నతంగా ప్రవర్తిస్తారో అతనికి మొదటిసారి తెలిసింది.

కథా నిలయం
5799
శ్రీకాకుళం

## మీరు చదివారా..?

## సి.ఎన్. చంద్రశేఖర్ ఇతర రచనలు

**కనులు మాటలాడునని...** ( కథాసంపుటి ) వెల : రూ॥ 60/-



తన తొలి కథాసంపుటి 'నీకోసమే...'తో పాఠకుల ఆదరణను చూరగొన్న నవ, యువ రచయిత... **సి.ఎన్. చంద్రశేఖర్** మరో రచన.

నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ ఎదురయ్యే వివిధ మానసిక, సామాజిక సమస్యలకు నివారణోపాయాన్ని సూచిస్తూ... మనలో పెంపొందించుకోవాల్సిన మహోన్నతాదర్శాలకు, మానవీయ విలువలకు పట్టం కట్టిన అపురూప కథల సంపుటి... 'కనులు మాటలాడునని...'

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

**జయంతి పబ్లికేషన్స్**

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన పూర్తి కేటలాగ్ కోసం మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.